అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ జగ్రామ్ అంతర్వేది బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లీష్ - 2 తెలుగు - 1, ఉర్దూ -1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ -2, జంతుశాస్త్రం (ఉర్దూ మాధ్యమం) - 1 మొత్తం 7 ఖాళీలు ఉన్నాయన్నారు. అభ్యర్థులు సంబంధిత పీజీ సబ్జెక్టులో కనీసం 55శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉన్నా అర్హులని, నెట్ సెట్ పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. బోధనా అనుభవం ఉన్న అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రం సమర్పిస్తే వెయిటేజీ ఉంటుందని సూచించారు. అర్హులైన అభ్యర్థులు తగిన ధ్రువపత్రాలతో ఈ నెల 23 లోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ నెల 24న ఉదయం 10 గంటల నుంచి కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

అనుదినం జనపక్షం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

1

గురువారం 20 జులై 2023

కాంగ్రెస్‌లో చేరికలు

ఇచ్చోడ : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం హీరాపూర్, దాబా(కె) గ్రామానికి చెందిన పలువురు ఆడే గజేందర్, మండల కన్వీనర్ కళ్లెం నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అందుకు క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు గడపగడపకు వెళ్లి ప్రచారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భీమన్న, మైనార్టీ చైర్మన్ ముస్తఫా, ఎస్సీ సెల్ చైర్మన్ లక్ష్మణ్, ఇచ్చోడ టౌన్ ప్రెసిడెంట్ బాబా, సీనియర్ నాయకులు చౌహన్ శేషారావ్, బోథ్ అసెంబ్లీ యూత్ ప్రెసిడెంట్ బద్దం పోతారెడ్డి, మండల యూత్ ప్రెసిడెంట్ నౌషద్ పాల్గొన్నారు.



ఎడతెరిపిలేని వర్షం..అన్నదాతల్లో హర్షం..!

- పంటలకు ప్రయోజనకరంగా మారిన వానలు
- జలకళను సంతరించుకుంటున్న ప్రాజెక్టులు
- నిండుకుండలా మారిన చెరువులు, కుంటలు
- మూడు రోజులు కురుస్తాయంటున్న వాతావరణశాఖ

మూడు రోజుల నుంచి కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో ఇన్నాండ్లు లోటు వర్షపాతం నమోదు కాగా.. తాజాగా కురుస్తున్న వర్షాలతో వర్షపాతం సాధారణ స్థితికి చేరుకుంది. 10 మండలాల్లో సాధారణం కంటే అధికంగా కురవగా.. మరో 10 మండలాల్లో మాత్రం తక్కువగా కురిసింది. మిగితా 50మండలాల్లో సాధారణానికి చేరుకుంది. ఇప్పటి వరకు కురిసిన వర్షాలు పంటలకు ప్రయోజనం చేకూర్చగా.. మరికొన్ని రోజులు నిరంతరంగా ఉంటాయని వాతావరణశాఖ చెబుతుండటంతో ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. తాజాగా కురుస్తున్న వర్షాలతో బోసిపోయిన సాగునీటి ప్రాజెక్టులు జలకళను సంతరించుకుంటున్నాయి. చెరువులు, కుంటలు నిండుకుండలా మారుతున్నాయి. చుక్కనీరు లేక ఎండిపోయిన వాగులు, వంకలు కొత్త నీటితో పరవళ్లు తొక్కుతున్నాయి. జలపాతాలు, సెలయేర్లు జలకళను సంతరించుకున్నాయి. మరో మూడు రోజుల పాటు మోసారు నుంచి భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాదు వాతావరణశాఖ చెబుతుండటంతో పరిస్థితి ఎలా ఉంటుందోనని జనాల్లో ఆందోళన సైతం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో కురిసిన వర్షపాతం
మి.మీటర్లలో

జిల్లా	సాధారణ	కురిసింది
ఆదిలాబాద్	375.1	346.3
కుమురంభీం	371.2	368.3
మంచిర్యాల	343.4	320.7
నిర్మల్	333.5	396.8

కడెం ప్రాజెక్టు నీటి విడుదల



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జోరు వానలు కురుస్తున్నాయి. ఆదివారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంటలకు మరింత జీవం పోస్తున్నాయి. మూడు రోజుల క్రితం వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లోటు వర్షాపాతమే నమోదు కావడంతో పంటల పరిస్థితిపై ఆందోళన కనిపించింది. మరోపక్క వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు పూర్తికావస్తున్నా సాగునీటి ప్రాజెక్టులు నిండలేదు. చెరువులు, కుంటలు, వాగులు, వంకలు బోసిపోయి కనిపించాయి. కానీ గత మూడు రోజుల నుంచి తెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో నీటి వనరులకు జలకళ వచ్చింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 50 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఆదిలాబాద్ జిల్లాలో జైనథ్, మావల, తలమడుగు, ఆదిలాబాద్ గ్రామీణ మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆసిఫాబాద్, బెజ్జూరు మండలాలు, మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట, కన్నేపల్లి, వేమనపల్లి, నెన్నెల మండలాల్లో లోటు వర్షపాతం నమోదు కాగా.. నిర్మల్ జిల్లాలో మాత్రం ఎనిమిది మండలాల్లో సాధారణం కంటే అధికంగా వర్షం కురిసింది. మిగితా వాటిలో సాధారణ వర్షపాతం నమోదైంది. ఉమ్మడి జిల్లాలోని పది మండలాల్లో సాధారణం కంటే అధికంగా కురిసింది. ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 5.30లక్షల ఎకరాలు(93శాతం) పంటలు సాగులోకి రాగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 3.47లక్షల ఎకరాలు(88శాతం) సాగులోకి వచ్చాయి. మంచిర్యాల జిల్లాలో 1.06లక్షల ఎకరాలు(32శాతం), నిర్మల్ జిల్లాలో 2.05లక్షల ఎకరాలు (52శాతం) విస్తీర్ణం సాగులోకి వచ్చింది.

సాగునీటి ప్రాజెక్టులకు జలకళ..!

తాజాగా కురుస్తున్న వర్షాలతో ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. ప్రధానంగా గోదావరి, ప్రాణహిత నదులకు వరద ఉధృతి పెరుగుతోంది. కడెం, ఎల్లంపల్లి, కుమురంభీం(అడ), సాత్నాల, మత్తడివాగు, స్వర్ణ, వట్టివాగు తదితర ప్రాజెక్టులు కొత్త నీటితో నిండుకుంటున్నాయి. మరోపక్క స్థానిక పంటలకు జీవమైన చెరువులు, కుంటలు నిండకుండలా మారుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. అడవుల మధ్యనున్న అందమైన జలపాతాలు పాలనురుగలతో పరవళ్లు తొక్కుతున్నాయి. ఎక్కడికక్కడ నీటి వనరులు నిండుకోవడంతో క్రమంగా భూగర్భజల మట్టం పెరిగేందుకు ఆస్కారం కనిపిస్తోంది. పశు పక్ష్యాదులకు తాగునీటి తాపం దూరం కానుంది. వర్షాకాలం ప్రారంభం నుంచి అడపాదడప వర్షాలు కురిసినా భూతాపం తగ్గలేదు. ఉక్కపోతను భరించలేక జనాలు ఉక్కిరిబిక్కిరయ్యారు. తాజాగా నిరంతరం వర్షాలు కురుస్తుండటంతో భూతాపం తగ్గిపోయి వాతావరణం చల్లగా మారింది. మరో మూడు రోజుల పాటు మోస్తారు నుంచి భారీ, అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ చెబుతుండటంతో రానున్న రోజుల్లో పరిణామాలు ఎలా ఉంటాయోనని జిల్లావాసుల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు వార్డు సభ్యురాలి రాజీనామా



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో నాలుగు రోజుల నుంచి బోథ్ మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో బుధవారం మార్లపల్లి గ్రామపంచాయతీకి చెందిన వార్డ్ సభ్యురాలు కట్ట శిరీష ఎంపీఈఓ జీవన్‌రెడ్డికి రాజీనామా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామెల్లి భోజన్న, సుమేర్ పాషా, మున్సిఫ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, కలెక్టర్‌కు వినతి

మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని సాధన సమితి సభ్యులు దీక్షలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును మర్యాద పూర్వకంగా కలిసి మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్ చేయాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి 2022లోనే కలెక్టర్ ద్వారా సీసీఎల్ఏకి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, డివిజన్ ప్రభుత్వం దృష్టిలో ఉందని తెలిపారు. తాను రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ఆర్జీయూకేటి రెండవ విడత కౌన్సెలింగ్

నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటి యూనివర్సిటీలో బుధవారం రెండవ విడత కౌన్సెలింగ్ ముగిసింది. స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్లోని ఆడిటోరియంలో విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. 148 సీట్లకు 130 విద్యార్థులు హాజరు కాగా 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డైరెక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియను డైరెక్టర్ సతీష్ కుమార్ పర్యవేక్షించారు. మెదక్ జిల్లా చేగుంట మండలం కర్నాల్‌పల్లి గ్రామానికి చెందిన రేఖాకు మొదటి ధ్రువీకరణ పత్రాన్ని డైరెక్టర్ అందజేశారు. నూతన విద్యార్థులు ఆగస్టు 1న క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాలని, 2 నుంచి 5 వరకు అవగాహన కార్యక్రమలు ఉంటాయని, 7 నుంచి తరగతులు ప్రారంభిస్తామని డైరెక్టర్ తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో కోఆర్డినేటర్ చంద్రశేఖర్, పావని, దత్తు, సభ్యులు రాగుల కుమార్, కుంట్ల శ్రీకాంత్, అడ్మిషన్స్ కమిటీ సభ్యులు హరికృష్ణ, సునీత, కృష్ణ, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీకి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి



నవతెలంగాణ-దస్తురాబాద్

రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసమే సీఎం కెసిఆర్ నిత్యం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. బుధవారం రైతువేదికలో క్లస్టర్ పరిధిలోని రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం పచ్చని పంట పొలాలతో కళకళలడుతుంటే బీజేపీ, కాంగ్రెస్ నాయకుల కళ్లు మండి రైతులపై వివక్ష చూపుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వారికి తగిన విధంగా బుద్ధి చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా తీర్మానం చేశారు. అనంతరం రైతులకు పామాయిల్ మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

బంగారు, వెండి ఆభరణాల రికార్డుల అప్పగింత



నవతెలంగాణ-బాసర

బాసర సరస్వతిదేవి ఆలయ ఈవోగా పని చేసి బదిలీపై వెళ్లిన వినోద్‌రెడ్డి ప్రస్తుత ఈవో విజయరామారావుకు బంగారు, వెండి ఆభరణాల రికార్డులను బుధవారం దేవాదాయ శాఖ జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారిణి అంజనాదేవి సమక్షంలో అప్పగించారు. ఆలయంలోని అమ్మవార్లకు, ప్రతిరోజు వాడుతున్న బంగారు వెండి ఆభరణాలతో పాటు భక్తులు సమర్పించిన కానుకలు తదితర వాటిని ఆలయ సన్నిధిలో ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్, ఆలయ ప్రధాన అర్చకుల సమక్షంలో అంజనాదేవి ఆధ్వర్యంలో పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శరత్ పాటక్, ఆలయ ఏఈఓ సుదర్శన్‌గౌడ్, సీనియర్ అసిస్టెంట్ సంజీవ్‌రావు, శివరాజ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌ను కలిసిన దశరథ్

ఇచ్చోడ : హుజురాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ తెలంగాణ కమిటీ ఎన్నికల చైర్మన్ ఈటెల రాజేందర్‌ను గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ బుధవారం హైదరాబాదులోని తన నివాసానికిజి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్‌గా రాజేందర్ నియామకం అయిన సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలో తాను నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం పార్టీ బలోపేతం గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మడి భీంరెడ్డి, జిల్లా కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి శివయ్య ఉన్నారు.

రైతును రాజును చేసిందే కాంగ్రెస్

- కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి
- జిల్లాలో రైతు భరోసా యాత్ర ప్రారంభం
- కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశానికి అన్నంపెట్టే రైతును రాజును చేసిందే కాంగ్రెస్ పార్టీ అని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకెట్ అన్వేష్‌రెడ్డి అన్నారు. కిసాన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు భరోసా యాత్రను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి జిల్లాకేంద్రంలో ప్రారంభించారు. ఈ యాత్ర ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల మీదుగా రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాలలో సాగనుంది. దేశానికి స్వాతంత్రం వచ్చిన కొత్తలో మొట్టమొదటి దేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సారథ్యంలో రైతు సంక్షేమ పథకాలు ప్రారంభించడం జరిగిందని అన్వేష్‌రెడ్డి తెలిపారు. పెద్దపెద్ద సాగు, తాగునీటి ప్రాజెక్టులను కట్టించిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. హరిత విప్లవాన్ని తీసుకొచ్చి వ్యవసాయాన్ని పండుగల చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందని గుర్తు చేశారు. నేడు తెలంగాణలో రైతు వ్యతిరేక ప్రభుత్వ పాలన సాగుతోందని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటివరకు దాని ఊసేత్తడం లేదని ఆరోపించారు. ఉచిత ఎరువుల హామీని, ఇన్‌పుట్ సబ్సిడీని ఎత్తివేసి రైతులను దగా చేస్తున్నారని మండిపడ్డారు. అటు 24 గంటల ఉచిత కరెంట్‌ను కాంగ్రెస్ హయాంలో అమలు చేస్తే దానినే బీఆర్ఎస్ సర్కార్ కాపీ చేసిందని ఎద్దేవా చేశారు. కానీ ఎక్కడా కూడా దానిని పకడ్బందీగా అమలు చేయడం లేదన్నారు. రికార్డులను మాయం చేసి రైతాంగాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తామని, ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ రాహుల్ రాజ్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టిపిసిసి ప్రధాన కార్యదర్శులు గంద్రత్ సుజాత, వెడ్మ బొజ్జు పటేల్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బూర్గుల మల్లేష్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో- ఆర్డినేటర్ కొండ గంగాధర్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాడె సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను తరిమికొట్టాలి

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- టీపీసీసీ చీఫ్ రేవంత్ వ్యాఖ్యలపై నిరసన



నవతెలంగాణ-నిర్మల్

వ్యవసాయానికి మూడు గంటలు కరెంటు ఇస్తే సరిపోతుందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ నాయకులు బుధవారం రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నేతృత్వంలో సోన్ మండల కేంద్రంలోని రైతువేదికలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో రైతులకు సీఎం కేసీఆర్ అండగా నిలిస్తే, కాంగ్రెస్ పార్టీ మాత్రం రైతులకు 3గంటలు కరెంట్ చాలు అంటూ అంటోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. గతంలో లాగా కరెంట్ సమస్యలు కానీ, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య లేదన్నారు. వ్యవసాయానికి సాగునీరు, నిరంతర నాణ్యమైన ఉచిత విద్యుత్, రైతు సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్ర రైతన్నల మోహంలో నవ్వు కనపడుతోందన్నారు. రేవంత్‌రెడ్డికి రైతుల కష్టాలు ఏం తెలుసు, ఏనాడైనా అరకపట్టి దుక్కి దున్నిండా అని, వ్యవసాయంపై రేవంత్‌రెడ్డిది అవగాహన రాహిత్యమని పేర్కొన్నారు. రైతులకు ఉచిత కరెంట్ ఎందుకన్న కాంగ్రెస్ నాయకులను గ్రామ పొలిమేరల వరకు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో కరెంట్ కష్టాలు, అప్పుల బాధలతో రైతన్న చితికిపోయారని విమర్శించారు. రైతులు మంచిగా బతుకుతుంటే కాంగ్రెస్ కడుపుమంటగా ఉందని మండి పడ్డారు. పుష్కలమైన సాగునీరు, నాణ్యమైన నిరంతర కరెంట్ సరఫరా, రైతుబంధు లాంటి అనేక సంక్షేమ పథకాలతో అన్నదాతలు ఆర్థికవృద్ధి సాధించారన్నారు. అనంతరం సర్కారు వ్యవసాయానికి అందిస్తున్న 24గంటల ఉచిత విద్యుత్ పథకాన్ని కొనసాగించాలని, 3 గంటలు వద్దు 3పంటలు కావాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, సోన్ జడ్ పీటీసీ జీవన్‌రెడ్డి, సర్పంచ్ వినోద్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

నవతెలంగాణ-ముధోల్

వర్షా కాలం దృష్ట్యా పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని చించాల, కారేగాం, విట్టోలితండా గ్రామాలలో పారిశుధ్య పనులను పరిశీలించారు. వర్షాకాలం కారణంగా సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను శుభ్రం ఉండేలా గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు మురికి కాలువలు, రోడ్లు నీటి ట్యాంకుల వద్ద పారిశుధ్య పనులు పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో అమీర్‌ఖాన్, కార్యదర్శులు అమిత, సాయినాథ్, గంగన్న ఉన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని గెస్ట్ లెక్చరర్ల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదేండ్లుగా సేవలందిస్తున్న తమను రెన్యువల్ చేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని గెస్ట్ లెక్చరర్లు డిమాండ్ చేశారు. తెలంగాణ జూనియర్ కళాశాలల అతిథి అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం డీఐఈఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అనంతరం ఇంటర్ బోర్డు అధికారి రవీందర్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 405 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో దాదాపు 1654 మంది అతిథి అధ్యాపకులుగా విద్యార్థులకు బోధిస్తున్నామని రాష్ట్ర కమిటీ సభ్యులు వేణు యాదవ్ అన్నారు. అరకొర జీతాలతో ఒకపూట తిని, మరోపూట పస్తులుండి సేవలందిస్తున్నామన్నారు. ఉత్తమ ఫలితాలు రాబట్టడంలో పూర్తి చిత్తశుద్ధితో తమవంతు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. తాజాగా పాతవారిని తొలగించి కొత్తవారిని మెరిట్ ఆధారంగా తీసుకోవాలని ఇంటర్‌బోర్డు కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేయడం బాధాకరమన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ నిర్ణయంతో తమ కుటుంబాలు రోడ్డునపడే అవకాశముందని, పునరాలోచించి తమనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా ప్రగతి భవన్‌ను సైతం ముట్టడించేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. కలెక్టర్ రాహుల్ రాజ్, ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు జోగురామన్న, రాథోడ్ బాపురావులకు వినతిపత్రం అందజేశారు.

టీచర్ వద్దని గ్రామస్తుల నిరసన



నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని రేవోజిపేట ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న సురేఖను పాఠశాలకు రావొద్దని పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాలుగా నియమితులైన సురేఖ పాఠశాలకు నెలలో పది రోజులు కూడా రాకపోవడం, సెలవులు వాడుకుంటున్నానని చెప్పడం పట్ల విద్యార్థులు నష్టపోతున్నారని తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో ఉన్నట్టుగా జిల్లా కేంద్రంలో ఉంటూ లైవ్ లొకేషన్ పెట్టడం సరికాదన్నారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ పాఠశాలకు చేరుకొని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. తహసీల్దార్ జిల్లా ఉన్నత విద్యాధికారికి, మండల విద్యాధికారికి సమాచారం అందించారు. మండల విద్యాధికారి టీచర్‌కు మెమో అందజేస్తామని, పాఠశాలకు హాజరు కాని రోజులకు జీతం కట్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వెంకటరమణ, వైస్ చైర్మన్ మహేష్ పాల్గొన్నారు.

భరంపూర్‌ను మండలంగా ప్రకటించాలని కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-తలమడుగు

భరంపూర్ గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని వివిధ గ్రామాల ప్రజలు, నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. తలమడుగు మండలంలో 40వేల జనాభా ఉండగా భరంపూర్ గ్రామాన్ని ఆనుకొని వివిధ గ్రామాలలో దాదాపు 20వేల జనాభా ఉందని కలెక్టర్ అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు. తలమడుగు మండలానికి వెళ్లాలంటే సరిగా రోడ్డు సౌకర్యం లేదని, దూరంగా కూడా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల ప్రజలు మాట్లాడుతూ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని చెప్పారని పేర్కొన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ జెడ్పిటిసి బొల్లారం బాబన్న, పిఏసిఎస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మేకల మధుకర్, సర్పంచులు రమేష్‌రెడ్డి, నారు కిష్టన్న, ఉప సర్పంచ్ నారాయణరెడ్డి, నాయకులు సోమన్న, మల్కు, అబ్దుల్లా, రంజిత్‌రెడ్డి, కమలాకర్, మాధవ్, సాగర్‌గౌడ్ ఉన్నారు.

నులిపురుగుల మాత్రలతో దుష్ప్రభావాలు ఉండవు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పిల్లల్లో అనారోగ్యానికి కారణమయ్యే నులిపురుగుల నివారణ కోసం పంపిణీ చేసే అల్బెండజోల్ మాత్రలతో ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి రాథోడ్ నరేందర్ తెలిపారు. డిఎంహెచ్ఓ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. యేడాది నుంచి 19సంవత్సరాలలోపు పిల్లలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా ఈ అల్బెండజోల్ మాత్రలు వేయించాలని సూచించారు. దీంతో వారు ఆరోగ్యవంతులుగా మారుతారని పేర్కొన్నారు. అలాగే వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు. ముఖ్యంగా విషజ్వరాల బారిన పడకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వేడి పదార్థాలనే తినాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని అన్నారు. 20న జిల్లావ్యాప్తంగా పిల్లలకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. అంతకుముందు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవానికి సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు.

వర్షంతో కూలిన ఇల్లు

నవతెలంగాణ-సిరికొండ



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ఇల్లు కూలిపోయి ఇంటి యజమాని తీవ్రగాయాల పాలైన సంఘటన లచ్చింపూర్-కెలో జరిగింది. గ్రామానికి చెందిన కరాటే కైలాస్(42) భార్యాపిల్లలతో ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మంగళవారం రాత్రి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం వల్ల ఇంటి గోడ కూలింది. దీంతో కైలాస్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
గురువారం 20 జులై 2023

ఆల్బెండజోల్ టాబ్లెట్లపై అవగాహనా ర్యాలీ

నవతెలంగాణ-కడెం



నులి పురుగులు ఉన్న పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్లు వేయాలని అవగాహన కల్పించడానికి బుధవారం అంబారిపేట్‌లో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొప్పుల లక్ష్మి-లచ్చన్న మాట్లాడుతూ మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్న పిల్లల నుండి 19సంవత్సరాలు నిండిన పిల్లలకు తల్లిదండ్రులు విధిగా ఆల్బెండజోల్ టాబ్లెట్ వేయించాలని సూచించారు. అంగన్వాడీ, ఆశా వర్కర్లు గురువారం పాఠశాలలో, గ్రామంలో ఇంటింటికి తిరిగి టాబ్లెట్లు వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేమ్‌దాస్, అంగన్వాడీ టీచర్ పద్మ, హేమలత, ఆయా లచ్చమ్మ, ఆశా వర్కర్ విజయ పాల్గొన్నారు.

సమగ్ర ఓటరు జాబితాపై బీఎల్ఓలకు పూర్తి అవగాహన కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమగ్ర ఓటరు జాబితాపై బూత్ లెవెల్ అధికారులకు పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తహసీల్దార్లను ఆదేశించారు. ఓటరు జాబితా రూపకల్పనలో పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా, సమగ్ర ఓటరు జాబితా రూపొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గరుడ యాప్‌లో వివరాల నమోదు సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని, నిర్దేశించిన గడువులోగా బీఎల్ఓలకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, కలెక్టరేట్ పర్యవేక్షకులు నలంద ప్రియ, రాజేశ్వర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

స్వర్ణ జలాశయానికి వరద నీరు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని స్వర్ణ జలాశయం ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్ట్‌లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. స్వర్ణ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 1183 అడుగులకు కాగా ప్రస్తుతం 1164 అడుగులకు చేరుకుంది. ఎగువ నుండి ఇన్‌ఫ్లో 890 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం 0.265 టీఎంసీల నీరు ఉన్నట్టు పేర్కొన్నారు.

పశువధశాలను తొలగించాలని కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలోని అనుమతి లేని పశు వధశాలను తొలగించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కోరారు. బుధవారం కలెక్టర్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పశువధశాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులతో ఎదుర్కోవటంతో పాటు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. అదేవిధంగా రిమ్స్ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరారు. ఆమె వెంట నాయకులు క్రాంతికుమార్, వెంకటేష్ బోయర్, శివకిరన్, ఋతిక్, ఇందిరమ్మకాలని వాసులు, రిమ్స్ సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీటీసీ



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మాజీ ఎంపీటీసీ ఒడ్నాల రాజేశ్వర్ బుధవారం జిల్లా కాంగ్రెస్ నాయకులు కుచాడి శ్రీహరిరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఒడ్నాల రాజేశ్వర్‌తో పాటు మండలానికి చెందిన మరికొందరు నాయకులు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. సామాజిక న్యాయం, అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతో మాత్రమే సాధ్యమని, అందుకే ఆ పార్టీలో చేరుతున్నట్లు రాజేశ్వర్ తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాయకులు ఈటెల శ్రీనివాస్, రవీందర్, సమ్మెట రవి, పృథ్వీ పాల్గొన్నారు.

బెటాలియన్ కమాండెంట్‌కు ఆత్మీయ వీడ్కోలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

యాపల్‌గూడలో గల రాష్ట్ర ప్రత్యేక పోలీస్ రెండవ బెటాలియన్ నుండి బదిలీపై వెళ్తున్న కమాండెంట్ ఆర్.వేణుగోపాల్‌ను బెటాలియన్ సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించి ఆత్మీయ వేడుకలు పలికారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ జయరాజు, అసిస్టెంట్ కమాండెంట్ అప్పరావు, కెవివి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుని ఉదారత



నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేసిన రమేష్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేయడానికి బుధవారం 100 ప్లేట్లను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ఇదే పాఠశాలలో 11సంవత్సరాలు హిందీ పండితునిగా పనిచేసే మూడు సంవత్సరాల క్రితం పదవీ విరమణ చేసినప్పటికీ పాఠశాలపై ఉన్న మమకారంతో విద్యార్థులకు అవసరమైన ప్లేట్లను అందజేయడం అభినందనీయమన్నారు. వారికి పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమరేందర్, పవన్, శ్రీనివాస్, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్ఐగా గణేష్ బాధ్యతలు

నవతెలంగాణ-బాసర

ఎస్ఐగా బుధవారం గణేష్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన మహేష్ నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లికి బదిలీ అయ్యారు. అక్కడి నుండి గణేష్ బదిలీపై బాసరకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సైకు సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఉజ్వల, లక్ష్మణ్, మాజీ సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు

ఉపాధ్యాయ సంఘాల మద్దతు

నవతెలంగాణ-ఖానాపూర్



కార్మికులు చేస్తున్న సమ్మెకు బుధవారం ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న దీక్షలకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు దాసరి శంకర్, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, వారికి ప్రతి నెల జీతాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాదవ్ వెంకట్రావు, పి.మురళీదర్, ఎస్‌కే.ఫాజిల్, బి.రాజశేఖర్, ప్రేమ్‌సింగ్, వసంత్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడిగా ఉపసర్పంచ్

నార్నూర్ : పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తుండడంతో గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా ఉండటానికి తాడిహత్నూర్ ఉపసర్పంచ్ ఫడ్ విష్ణు బుధవారం పారిశుధ్య కార్మికుడిగా, డ్రైవర్‌గా మారాడు. చెత్తను ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించాడు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో ముందస్తు జాగ్రత్తగా పారిశుధ్యం లోపించకుండా పనులు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

బోథ్ : బస్టాండ్ అవరణలో పంచాయతీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు బుధవారం 14వ రోజుకు చేరాయి . ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకుడు దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాల నుంచి చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కుడాల స్వామి, జిల్లా నాయకులు కారం రవి, నల్ల చిన్నయ్య, వన్నెపాక అశోక్, రాజన్న పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : నిత్యం గ్రామాల్లో పనిచేసే పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకొని పరిష్కరించాలని మండల అధ్యక్షులు ముత్తుకూరు దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సమ్మె 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నరేష్, ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, కోశాధికారి ప్రభాకర్, గంగాధర్, నర్సమ్మ, లక్ష్మి, లలిత, గంగామణి, ఊశన్న, అడెల్లు, లస్మన్న, శ్రీరామ్, మల్లేష్ పాల్గొన్నారు.

కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఇక్కట్లను దూరం చేస్తున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని రణదివెనగర్‌లో రూ.10లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సవారి బంగ్లాను బుధవారం ఆయన ప్రారంభించారు. ముందుగా కాలనీకి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి బంగ్లాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మొహరం పండగ మత సామరస్యానికి ప్రతీక అని, నియోజకవర్గంలో దాదాపు ఏడు కోట్ల రూపాయల వ్యయంతో సవారి బంగ్లాలు, షెడ్లను నిర్మిస్తున్నామని అన్నారు. మందిరాలు, చర్చిలు, మసీదులు, బుద్ధ విహార్ల అభివృద్ధికి కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కుల, మతాల తేడా చూపకుండా సమగ్ర అభ్యున్నతికి పాటు పడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రౌత్ మనోహర్, కౌన్సిలర్ కోవ రవి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, నల్ల మహేందర్, పర్వీన్ పాల్గొన్నారు.

టీచర్ల బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలి

నవతెలంగాణ-ఖానాపూర్



రాష్ట్ర ప్రభుత్వం పిఆర్‌సిని వెంటనే ప్రకటించి, ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలని రాష్ట్ర నాయకులు జాదా వెంకట్రావు, టీఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి శంకర్ అన్నారు. బుధవారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యుఎస్‌పిసి) ఆధ్వర్యంలో పట్టణంలోని ఆశ్రమ పాఠశాల నుండి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు రెండో పిఆర్‌సిని ప్రకటించడంతో పాటు సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్స్ వెంటనే మంజూరు చేయాలని, విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, మన ఊరు మన బడి పనులను వేగిరం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మురళీధర్, బి.రాజశేఖర్, ఎస్కే ఫాజిల్, ప్రేమ్‌సింగ్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెయ్యి మంది యువకులకు ఐటీలో ఉద్యోగావకాశాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ చరిత్రలో నిలిచిపోయేలా జిల్లా కేంద్రంలో ఐటీ టవర్ నిర్మాణాన్ని చేపట్టనున్నామని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా విశేష కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డ్ పరిధిలో నిర్మిస్తున్న ఐటీ టవర్ నిర్మాణ పనులు ప్రాథమికంగా ప్రారంభమైన నేపథ్యంలో బుధవారం ఆయన పర్యవేక్షించారు. రూ.40కోట్ల వ్యయంతో వెయ్యి మంది పనిచేసే సామర్థ్యంతో టవర్‌ను నిర్మించనున్నారు. ఇందుకోసం మూడెకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. త్వరలోనే పూర్తిస్థాయి పనులను మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి వారికి ఉజ్వల భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని చైర్మన్ తెలిపారు. సొంత ఊర్లోనే మంచి ఉద్యోగం పొందేందుకు సదావకాశమన్నారు. ఇప్పటికే ఎన్డీటి డేటా కంపెనీకి సంబంధించి తాత్కాలిక భవనంలో ఐటీ సేవలు ప్రారంభమయ్యాయన్నారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు నాయకులు ఎమ్మెల్యే పనితీరుపై విమర్శలు చేయడం వారి చేతకాని తనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. తాజాగా పట్టణాభివృద్ధిలో భాగంగా చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, వాటర్ సప్లై కోసం రూ.320కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. చైర్మన్ వెంట కౌన్సిలర్ పవన్ నాయక్, విలాస్, ఖలీం ఉన్నారు.

సమిష్టి కృషితో మోడల్ జీపీగా ముత్నూర్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మౌలిక సదుపాయాల కోసం అధికారులు, గ్రామస్తుల సమిష్టి కృషితో ముత్నూర్‌ను మోడల్ జీపీగా తీర్చి దిద్దాలని జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. బుధవారం ఆయన గ్రామాన్ని సందర్శించారు. ప్రతి ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలను కలిగి ఉండాలన్నారు. ప్రతి కుటుంబీకులు తాము ప్రతి రోజు సేకరించిన చెత్తను గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో వేయాలని సూచించారు. పరిశుభ్రతను పాటించడం వల్ల వర్షాకాలంలో ప్రబలే మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి రోగాలు రాకుండా నివారించవచ్చన్నారు. అనంతరం మహిళా సంఘాలు, వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. ఆయన వెంట డిఆర్‌డిఓ కిషన్, జడ్పీ సీఈవో గణపతి, సర్పంచ్ తుమ్రం బాగుబాయి, మారుతీ, జీవ వైవిధ్య కమిటీ సభ్యులు మర్సకోల తిరుపతి ఉన్నారు.

జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో ఎక్కువ శాతం ఆదివాసులు నివసిస్తున్న నేపథ్యంలో వర్షా కాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల కోసం ప్రభుత్వం జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం వచ్చిందంటే జిల్లాలో ఆదివాసీ గూడేల్లో ఎంతోమంది వ్యాధుల బారిన పడి ప్రాణాలు కోల్పోతుంటారన్నారు. వ్యాధులను అరికట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలుగా చేపట్టాలని కోరారు. అదేవిధంగా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేపట్టాలని డిమాండ్ చేశారు. రుణాలు మాఫీ కాకపోవడంతో బ్యాంకుల్లో కొత్త రుణాలు రాక, పాత రుణాలు పోక రైతుల బతుకులు అగమ్యగోచరంగా మారాయని అన్నారు.

మూడు గంటల కరెంటా? మూడు పంటలా?

- ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

రైతులకు మూడు గంటల కరెంట్ కావాలా..మూడు పంటలు కావాలా అని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో విద్యుత్ అంశంపై చర్చించేందుకు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతో మోటార్లు కాలడం, ట్రాన్స్‌ఫార్మర్లు పేలడం సర్వసాధారణం అని అన్నారు. చాలా మంది కరెంట్ షాక్ బలయ్యారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో నేడు 24గంటల ఉచిత కరెంటుతో రైతుల బాధలు పూర్తిగా తొలగిపోయాయని తెలిపారు. రేవంత్ చంద్రబాబు శిష్యుడని, ఆయన ఆరు గంటలంటే, ఈయన మూడు గంటలు అనడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కానిందే రాజారాం, సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీ తిరుమల, భీంపూర్ మండల కన్వీనర్ నాగయ్య, తలమడుగు మండల కన్వీనర్ వెంకటేష్, బోథ్ మార్కెట్ కమిటీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ భోజన్న, డైరెక్టర్లు నర్సారెడ్డి, సాయి చైతన్య, గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లాకు 15 మంది నూతన ఎస్ఐలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు ఉన్నతమైన సేవలను అందించాలని ఎస్పీ డి ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాకు కేటాయించబడిన 26 మంది ఎస్ఐలలో 15 మంది ఎస్ఐలు బుధవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ 15 మంది ఎస్ఐలు నిజామాబాద్ కమిషనరేట్ నుండి ఆదిలాబాద్ జిల్లాకు కేటాయించినట్లు తెలిపారు. కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఉన్నతమైన సేవలను అందించాలని తెలిపారు. తమకు కేటాయించిన పోలీస్‌స్టేషన్లలో ప్రజలతో సంబంధాలు పెంచుకొని అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై అన్వర్ ఉల్ హక్ పాల్గొన్నారు. జిల్లాకు వచ్చిన నూతన ఎస్ఐలలో బి రాము, జి నరేష్, బి నవీన్, పి సంజీవరావు, సిరిగిరి సాయన్న, అనంతసాగర్, ఎండి రహమతుల్లా, డి దేవ్ కుమార్, బి శివరాం, బి పుష్పవతి, టి గోవింద్, ఎస్ సంతోష్‌రెడ్డి, సుంకరి సాయన్న, వి ఉదయ్ కుమార్, హబీబ్ ఖాన్ ఉన్నారు.

వర్ష బాధితులకు పరామర్శ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని బంగారిగూడ కాలనీలో పలు ఇండ్లు నీట మునిగాయి. విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి బుధవారం కాలనీని సందర్శించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షం కారణంగా ఇళ్లలో నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. అనంతరం సుహాసినిరెడ్డి మాట్లాడుతూ బంగారిగూడ కాలనీని ఎమ్మెల్యే ఒకసారి సందర్శించాలన్నారు. పేదలు ఉంటున్న కాలనీలో సరైన సదుపాయాలు కల్పించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారన్నారు. ఆమె వెంట పార్టీ నాయకులు, కాలనీవాసులు ఉన్నారు.

మాలీలకు ఎస్టీ హోదా చారిత్రక అవసరం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అన్ని రంగాల్లో వెనుకబడ్డ తెలంగాణ మాలీలకు ఎస్టీ హోదా కల్పించడం చారిత్రక అవసరమని, సీఎం కేసీఆర్ నిర్ణయం అభినందనీయమని, కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెంటనే మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని మాలి జాతీయ సదస్సులో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అఖిల భారతీయ మాలీ మహా సంఘం 22వ స్థాపన దినోత్సవం పురస్కరించుకొని నాసిక్‌లో జరిగిన కార్యక్రమంలో సుకుమార్ పెట్కులే మాట్లాడుతూ జాతీయస్థాయి నేతలంతా ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాన్ని సమర్థించడం హర్షించదగ్గ విషయమని, వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని కోరారు. ఏకగ్రీవ తీర్మానం చేసిన జాతీయ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ అధ్యక్షులు విలాస్‌రావు పాటిల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సంబాజి పగారే, ప్రముఖ పారిశ్రామికవేత్త డీకే మాలి, మానవ హక్కుల సంఘం జాతీయ అధ్యక్షులు శివదాస్ మహాజన్, డాక్టర్ పూలే సూరత్, తెలంగాణ నుండి సంఘ కార్యకర్తలు సుభాష్ షెండే, మురళీధర్ నాగోషే, గజానంద్ చౌదరి, ధనంజయ ప్రధాన్, వాడగూరే విజయ్, కల్పన పెట్కులే, లక్ష్మీ షిండే, అంబాదా సెండే పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బెండరలోని ఆదర్శ డిగ్రీ కళాశాలలో అతిథి ఆధ్యాపకుల ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో చరిత్ర, ఆంగ్లం, రాజనీతి శాస్త్రం, జంతుశాస్త్రం, వాణిజ్యశాస్త్రం, తెలుగు, కంప్యూటర్స్, గణితం, అర్థశాస్త్రం సబ్జెక్టులలో ఒక్కోటి చొప్పున ఖాళీలు ఉన్నాయని ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 22వ తేదీలో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నెట్, సెట్, పీహెచ్డీ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, అవి లేనిచో పీజీలో 55 శాతం అర్హత మార్కులు కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9912596756 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని మురిమడుగు గ్రామానికి చెందిన దుసముడి నరసయ్య ప్రమాదవశాత్తు ఇంటి పైనుంచి పడటంతో వెన్నుపూస విరిగింది. ఈ విషయం తెలుసుకున్న బొంబాయి గణేష్ మండలి, గంగపుత్ర సంఘం సభ్యులు బుధవారం రూ.10వేల నగదును ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అతనిని ఆదుకోవాలని అన్నారు. దాతలు ముందుకు వచ్చి అతనికి ఆర్థిక సాయం అందించాలని కోరారు.

'సొంత భూమిలో గుడిసెలు వేశాం'



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల్ గ్రామంలో పాల గౌరీ ఏరియాలో సర్వేనెంబర్ 112లో ఉన్న భూమి తమదేనని ఆ గ్రామ గిరిజనులు ఆదివాసి సేవా సంఘం నాయకులు, ఆత్రం రాజు, ఆత్రం చిత్రు, సీడం మోతిరామ్ మడావి సోము తెలిపారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత మూడు రోజుల క్రితం జన్నారం మండల అటవీ అధికారులు పోలీసులు ఆ స్థలంలోకి వచ్చి అది ప్రభుత్వ భూమి అని, అనడం విడ్డూరమన్నారు. ఆ సర్వే నెంబర్‌లో ఉన్న 631.33 గుంటల భూమి ఆత్రం మహదు పేరుమీద పట్టా ఉన్నదన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పహాని ఉందని పేర్కొన్నారు. పోలీసు అటవీ అధికారులు ఏమీ తెలవకుండా ఇలా అనడం సరికాదన్నారు. ఈ భూమిపై గిరిజనులు అటవీ అధికారులు సమస్యను పరిష్కరించుకోవాలని 15 రోజుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికీ వారు స్పందించకపోవడం దారుణం అన్నారు. రెవెన్యూ అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. లేని పక్షంలో ఆదివాసి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సేవా సంఘం నాయకులు, ఆత్రం జ్యోతిరావు, దుర్వ యశ్వంతరావు, కృష్ణ, ఆత్రం లక్ష్మణ్, బొజ్జు, విశ్వనాథ్, సోము, జంగు పాల్గొన్నారు.

విద్యార్థుల విద్యాభివృద్ధికి చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు సమగ్ర చర్యలు చేపట్టాలని ఎంపీపీ మల్లికార్జున్ తెలిపారు. మండలంలోని మోవాడు ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలు తెలుసుకొని, పాఠశాలలో భోజన, సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివద్ధి కోసం ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నూతన విధానాలు అమలు చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా గురుకులాల నిర్వహణ తెలంగాణ రాష్ట్రంలో సాగుతోందని అన్నారు. హరితహారం కార్యక్రమం మండలంలోని వావుదాం, మోవాడు, వెంకటాపూర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమంలో పాల్గొని ఎంపీపీ మల్లికార్జున్ మొక్కలు నాటారు ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకొని మొక్కలు పెంచాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు లింగు, సత్రవేణి, సావిత్రిమల్లేష్, ఎంపీడీఓ శశికళ, ఏపీఓ చంద్రశేఖర్, సర్పంచ్ బాబురావు నాయకులు బాదుపటేల్, అటవీ శాఖ సిబ్బంది వెంకటేష్ పాల్గొన్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-జన్నారం

ఆకతాయిలతో బాలికలు అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల షీటీం ఇన్‌ఛార్జి ఎస్ ఓబులమ్మ అన్నారు. బుధవారం మండలంలోని కలమడుగు జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో, బాలికలపై అత్యాచారాలు అఘాయిత్యాలు ఎక్కువ అయ్యాయని అన్నారు. ఆకతాయి కుర్రాళ్ళ పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్, ఇంస్టాగ్రామ్, ఆకతాయిలు ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెడుతూ బాలికలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఆకతాయిలు ఎలాంటి ఇబ్బందులకు గురిచేసిన సీటీం పోలీసులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాడి ప్రభాకర్, ఎన్‌సీసీ అధికారి కట్ట రాజమౌళి, షీ టీం పోలీసులు ఏఎస్సై రాథోడ్, జ్యోతి, ఉపాధ్యాయులు లక్ష్మీ రమేష్ పాల్గొన్నారు.

పట్టణంలో అదనపు కలెక్టర్ పర్యటన

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలో బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ పర్యటించారు. మున్సిపల్ పరిధిలోని అభివృద్ధి పనులలో భాగంగా చేపట్టే పనుల ప్రదేశాలను పరిశీలించారు. సంబంధిత మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్‌కు చేపట్టే పనులను నాణ్యత లోపించకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ కమిషనర్ జి.వెంకట నారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఏ.విద్యా సాగర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు ఎంఏఇ అచ్యుత్ పాల్గొన్నారు.

ఘనంగా కోనేరు వంశీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - కౌటాల

కోనేరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కోనేరు వంశీ జన్మదిన వేడుకలను మండలకేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో బీఆర్ఎస్ మండలస్థాయి నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వొజ్జెల మౌనీష్, ఎంపీటీసీ మనీష్, ఉప సర్పంచ్ తిరుపతి, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాస్, నాయకులు భిట్టుపెల్లి సంతోష్, గట్టయ్య ఆత్మారాం, రాంచందర్, సోళ్ల బాపు, రమేష్ పాల్గొన్నారు.

నులిపురుగులను నలిపేద్దాం

- పిల్లలకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందిద్దాం
- నేడు నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం
- అల్బెండజోల్ మాత్రల పంపిణీకి వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆరోగ్యవంతమైన జీవితాన్ని పిల్లలకు అందించడం తల్లిదండ్రుల కనీస కర్తవ్యం. భవిష్యత్‌లో పిల్లలు ఆరోగ్యవంతులుగా తయారైతేనే వారిలో నైపుణ్యాభివృద్ధి పెంపొందుతుంది. అందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాల్సి ఉంది. పిల్లల్లో పోషకాహారలోపం, రక్తహీనత తగ్గించడం, శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పాటునందించాలి. అందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఆరోగ్య సమాజం ఏర్పాటులో భాగంగా ప్రభుత్వం వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 1-19 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేసేందుకు చర్యలు చేపడుతోంది. జిల్లాలో 1,71,760 మందికి మాత్రలు వేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రలు అందించనున్నారు. అంతేకాక విద్యనభ్యసించని వారికి ఆశా కార్యకర్తలు మాత్రలు అందించే విధంగా చర్యలు చేపట్టారు. నేడు మాత్రలు వేసుకోని వారికి ఈ నెల 27న మరోసారి మాత్రలు వేసే విధంగా ప్రణాళికను రూపొందించారు.

అపరిశుభ్రతతోనే నులిపురుగుల వ్యాప్తి

అపరిశుభ్రతతోనే నులిపురుగులు పిల్లలకు సంక్రమిస్తాయి. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే నులిపురుగులు వ్యాపిస్తాయి. చేతిగోర్లను శుభ్రంగా ఉంచుకోవాలి. గోర్లు పెరిగినపుడు వెంటనే కత్తిరించుకోవాలి. అలా చేయకపోవడం వల్ల వాటిలో మట్టి చేరి అనారోగ్యానికి కారణమవుతుంది. అదేవిధంగా పరిశుభ్రమైన నీటిని తాగాలి. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయడం వల్ల కూడా నులిపురుగులు వ్యాప్తి చెందే అవకాశముంది. భోజనం చేసేటప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. కూరగాయలను శుభ్రమైన నీటితో కడగాలి. ఆహార పదార్థాలపై ఎప్పుడూ మూతలు కప్పి ఉంచాలి.

నులిపురుగులతో అనర్థాలు

నులిపురుగుల వల్ల పిల్లలకు అనేక అనర్థాలు కలుగుతాయి. ముఖ్యంగా 1-19 సంవత్సరాల వయస్సున్న వారిలో రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపులోనొప్పి, వ్యాధినిరోధక శక్తి తగ్గడం, వికారం, వాంతులు, మలంలో రక్తం, అతిసారంతో పాటు మరికొన్ని ఇబ్బందులు తలెత్తుతాయి.

నిర్మూలనకు తీసుకోవాల్సి చర్యలు

పిల్లల్లో మూడు రకాల పురుగులు ఉండే అవకాశం ఉంది. ఏలికపాములు, నులిపురుగులు, కొంకిపురుగులు. వీటిని నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలను తీసుకోవాలి. 1-2 సంవత్సరాల వయస్సు గలవారు 200ఎంజీ మాత్రను, మిగతావారు 400 ఎంజీ మాత్రను వేసుకోవాలి. భోజనం తర్వాత వేసుకోవచ్చు. మాత్రలు వేసుకున్న ఒక రోజు లేదా రెండు రోజుల్లో నులిపురుగులు ఉన్నట్లయితే మలవిసర్జన ద్వారా బయటకు వెళ్తాయి. ఈ మాత్రలను దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, ఇతర వ్యాధులకు మందులు వాడుతున్న వారు వేసుకోకూడదు. నులిపురుగులు ఉన్న వారికి మాత్రలు వేసుకుంటే వికారం, వాంతులు అవుతాయి. అదే విధంగా స్వల్పంగా జ్వరం వచ్చే అవకాశముంది.

డీవార్మింగ్‌డేను విజయవంతం చేయాలి

-రామకష్ణ, జిల్లా వైద్యాధికారి



నేడు జాతీయ డీవార్మింగ్ డే సందర్భంగా జిల్లాలో 1-19 ఏళ్ల పిల్లలందరికీ నులిపురుగుల నిర్మూలన కోసం ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. ఈ మందుల పంపిణీ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లాలోని వైద్య సిబ్బంది అంగన్‌వాడీ కార్యకర్తలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో మందులు పంపిణీ చేయాలి. జిల్లాలో యేడాది నుంచి 19 యేళ్ల వయస్సు ఉన్నవారు. 1,71,760 మంది చిన్నారులున్నట్టు గుర్తించాము. నేడు అందుబాటులో లేనివారికి ఈ నెల 27న 100 శాతం మాత్రలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఎస్ఎఫ్ఐ విస్తృతస్థాయి సమావేశం



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ అధ్యక్షతన, జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి ప్రారంభించగా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో నూతనంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులుగా ఐదుగురిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రజినీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలం అయిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేజీ టు పీజీ ఉచిత విద్య అందించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.5100 కోట్ల స్కాలర్షిప్ తక్షణమే విడుదల చేయాలన్నారు. సంక్షేమ హస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, మంచిర్యాల సోషల్‌వెల్ఫర్ డీడీకి వినతి పత్రం అందజేశారు. మంచిర్యాల పాత కలెక్టర్ కార్యాలయం ఎస్సీ హస్టల్ విద్యార్థులకు ఇవ్వాలని, చెన్నూర్‌లో ప్రభుత్వ బాలికల, బాలురు కాలేజీ హాస్టల్ నూతనంగా ఏర్పాటు చేయాలని, బెల్లంపల్లిలో ఎస్సీ పాఠశాల, కళాశాల హాస్టల్ భవనాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. లక్షెట్టిపేట, దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థలో ఉన్నాయని, విద్యార్థుల బాధను ఎవరు పట్టించుకోవడం లేదని, కనీసం మౌళిక సదుపాయాలు కూడా లేవని అన్నారు. ఈ వర్షం కాలంలో దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల రేకులతో ఉన్నదని, గదులు కూడా సరిగ్గా లేవని, బాత్రూం సరిగా లేక అవస్థలు పడుతున్నారని విమర్శించారు. ఇలాంటి పేద మధ్యతరగతి విద్యార్థులు ఏవిధంగా చదువుకోవాలని, ఇంజనీరింగ్ కళాశాల లేక మంచిర్యాల జిల్లా విద్యార్థులు హైదరాబాద్, కరీంనగర్, వెళ్లి చదువుకుంటున్నారని, ఈ జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్మ, సాయి గణేష్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

నవతెలంగాణ-హాజీపూర్



మండలంలోని ముల్కల్ల గ్రామంలో నేషనల్ హెల్త్ మిషన్ నిధుల నుంచి రూ.20 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణికి బుధవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఆరోగ్య ఉప కేంద్రానికి ముల్కల్ల గ్రామానికి చెందిన గొనె సతీష్‌రావు తన తండ్రి జ్ఞాపకర్థం 300 గజాల భూమిని విరాళంగా ఇచ్చినందుకు సతీష్ రావును ఎమ్మెల్యేతో పాటు పలువురు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి ఉప కేంద్రాలను నిర్మిస్తామన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నానమని తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాలలో అభివృద్ధి లక్ష్యంగా దూసుకుపోతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య రక్షణకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని అన్నారు. వైద్యశాలలు ఏర్పాటు, వైద్యుల నియామకం, సిబ్బంది నియమకాలు చేసి నిరుపేద రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వం చొరవ ఎంతో ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత -శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర విద్య సంక్షేమ మౌలిక సదుపాయాల అభివద్ధి సంస్థ డిఈ శ్రీనివాస్, ఏఈ రాజేశ్వర్‌రెడ్డి, మండల వైద్య అధికారిణి లహరి, స్థానిక సర్పంచు మంచాల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బెతు రమాదేవి పాల్గొన్నారు.

మన ఊరు-మన బడి పనులను త్వరగా పూర్తిచేయాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మన ఊరు-మన బడి పనులను త్వరగా పూర్తిచేయాలని జాయింట్ డైరెక్టర్ రాజీవ్ అన్నారు. బుధవారం మండలంలోని ఎంపీపీఎస్(సంజీవనగర్), పెంచికల్‌పేట్ ఉర్దూ మీడియం పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ విద్యాలయాలను సెక్టోరియల్ అధికారి స్వర్ణతో కలిసి పాఠశాలల్లో పూర్తయిన పనులను పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డైనింగ్‌హాల్ నిర్మాణాన్ని, తాగునీటి వసతులను పరిశీలించి త్వరగా పూర్తిచేయాలన్నారు. ఉపాధిహామీ ద్వారా వచ్చిన మూత్రశాలల నిర్మాణ పనులపై త్వరగా చర్యలు చేపట్టేల చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఎస్ఎల్ఎస్ పరిశీలనలో భాగంగా పాఠశాల విద్యార్థుల యొక్క సామర్థ్యాలను, ఉపాధ్యాయుల విద్యాబోధన తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మన ఊరు-మన బడిలో భాగంగా పాఠశాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అవసరమున్న పనులు చేయించుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు యాదగిరి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

నవతెలంగాణ-కౌటాల



మండలకేంద్రంలోని నహీమాబాద్ ఏరియాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ నిండుగా పిచ్చి మొక్కలు పెరిగి కనపడకుండా పిచ్చి మొక్కలు పెరిగాయి. వర్షాకాలం కావడంతో ఆవులు, గేదెలు ఆ ప్రాంతంలో తిరిగితే విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశముంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించి ప్రమాదం భారి నుండి కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ మోహన్

నవతెలంగాణ-జైపూర్



రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధి జైపూర్ సబ్ డివిజన్ ఏసీపీగా బలుసాని మోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత కాలం జైపూర్ ఏసీపీగా విదులు నిర్వర్తించిన నరేంద కరీంనగర్ పట్టణ ఏసీపీగా బదిలీపై వెళ్లారు. రామగుండం ఏసీపీ (సీఎస్‌బీ)గా విధులు నిర్వరిస్తున్న బాలుసాని మోహన్ జైపూర్ ఏసీపీగా ఇక్కడికి బదిలీపై వచ్చారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ



నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని జనగామ గ్రామ పంచాయితీ సర్పంచ్ గట్టు లక్ష్మణ్‌గౌడ్ తల్లి ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న ఉమ్మడి అదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కుమార్ బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఫోటోకి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి అదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ గట్టు కిష్టబాయి వీర నారి అన్నారు. ధైర్యంగా ఉంటూ ఎంతటి సమస్యనైనా పరిష్కరించే సామర్థ్యం ఉన్న మహిళ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్పీ చైర్మన్ నల్లాల భాగ్యలక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఎంపీపీ మంత్రి సురేఖ, ఏఎంసీ వైస్ చెర్మెన్ బైస ప్రభాకర్, చెన్నూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ కోఆర్డినేటర్ ముల్కల్ల శిశిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు యువకుల చేరిక



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణ పరిధిలోని పులిమడుగుకు చెందిన బీజేపీ మాజీ యూత్ ప్రెసిడెంట్ గుడికందుల హరినాథ్, పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం టీపీసీసీ అధ్యఓఉడు రేవంత్‌రెడ్డి నివాసంలో డాక్టర్ రాజా రమేష్ ఆధ్వర్యంలో చేరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అధికార ప్రతినిధి వోడ్నాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గోపతి రాజయ్య, మందమర్రి మండల అధ్యక్షుడు కడారి జీవన్, జైపూర్ మండల్ యూత్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, మాజీ వార్డ్ సభ్యుడు ఉప్పలపు సురేష్, మహేష్, కిరణ్, వంశీ, నరేష్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై కళాజాత

నవతెలంగాణ-కౌటాల

జీపీ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా బుధవారం పారిశుధ్యంపై మండలంలోని ముత్యంపేట గ్రామంలో కళాజాత నిర్వహించారు. వీధుల్లో తిరుగుతూ పారిశుధ్యంపై అవగాహన కల్పించి నిరసన తెలిపారు. ఇంటిలో ఊడ్చిన చెత్తను రోడ్డుపై వేయకూడదని, పోగు చేసిన చెత్తను ఒక గుంత తయారుచేసి గుంతలో వేసుకుంటే సేంద్రియ ఎరువు తయారవుతుందని, దానిని పంట పొలాల్లో వేసుకుంటే పంట దిగుబడి అధికంగా వస్తుందని అవగాహన కల్పించారు.

కోల్ ఇండియాలో లేని హక్కులు సాధించాం : వెంకట్రావు



నవతెలంగాణ-నస్పూర్

కోల్ ఇండియాలో లేని హక్కులు సాధించామని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకటరావు అన్నారు. బుధవారం ఆర్కే-7 గనిలో ఫిట్ సెక్రటరీ మిండే వెంకట్ ఆధ్వర్యంలో, ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్‌కు కార్మికుల మీద ఉన్న ప్రేమతో తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత అనేక వరాలు ప్రకటించడం జరిగిందన్నారు. ఇటీవల మంచిర్యాల జిల్లాకు ముఖ్యమంత్రి వచ్చిన సందర్భంగా కార్మికుల గురించి సింగరేణిలో ఉత్పత్తి టర్నోవర్ పెరిగే అత్యధిక లాభాలు రావడం, వచ్చిన లాభాల్లో కార్మికులకు రూ.700 కోట్లను పంచుతున్నట్లు చెప్పారన్నారు. దసరాకు ముందే లాభాలను ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షులు ధీకొండ అన్నయ్య మంద మల్లారెడ్డి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి చాట్ల అశోక్, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, ఏరియా జీఎం చర్చల ప్రతినిధి వెంగల కుమారస్వామి, బ్రాంచ్ సెక్రటరీ భూపతి అశోక్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు తొంగల రమేష్, రౌతు సత్యనారాయణ పాల్గొన్నారు.

పేద విద్యార్థి ప్రతిభకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని చించాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన సాయిగణేష్ ఇటీవల పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి, హైదరాబాద్‌లోని మాసాబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ డిప్లొమా కోర్స్‌లో సీటు సంపాందించాడు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించి సన్మానించారు. పేద విద్యార్థికి కళాశాలలో ప్రవేశం కొరకు అయ్యే ఖర్చుల నిమిత్తం ఐదు వేల ఆర్థిక సహాయాన్ని ఉపాధ్యాయులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హజారే నాగేందర్, గంగాధర్, సర్పంచ్ సంగీత మరిబా, ఉపాధ్యాయులు ప్రభాకర్, రాజశేఖరచారి, అనిల్‌కుమార్, బసవరాజు, కవిత, వనజ, భోజబాయి, గ్రామస్తులు శివాజీ, శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖానాపూర్ బీఆర్ఎస్ అధికార ప్రతినిధిగా జి.రాజేష్ యాదవ్

నవతెలంగాణ-జన్నారం

బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా జన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జి.రాజేష్ యాదవ్ నియమితులయ్యారు. ఆయనకు ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. రాజేష్ గతంలో మూడుసార్లు టీఆర్ఎస్ యువత అధ్యక్షులుగా, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా నాలుగుసార్లు పనిచేశారు. ఈ సందర్భంగా రాజేష్ యాదవ్ మాట్లాడుతూ తనను అధికార ప్రతినిధిగా నియమించిన ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అందుకు సహకరించిన పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ఎంపీపీ మాదాడి సర్వజన రవీందర్‌రావు, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ ఇతర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

భూసేకరణకు వ్యతిరేకం : రామారువుపేట రైతులు



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి యాజమాన్యం తమ అవసరాల కోసం భూములు సేకరిస్తున్న తీరును మేము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని రామారావుపేట్ శివారు రైతులు పేర్కొంటున్నారు. శ్రీరాంపూర్, ఇందారం ఓపన్ కాస్ట్ గని విస్తరణ కోసం ఇప్పటికే వందల ఎకరాలు సేకరించిన సింగరేణి యాజమాన్యం మిగిలిన మా వ్యవసాయ భూములను తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని బాధిత రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తీసుకున్న భూములు కాకుండా ఇప్పుడు మరో 129 ఎకరాల భూమిని తీసుకునే ప్రయత్నంలో మా ప్రమేయం లేకుండానే భూములు తీసుకునేందుకు కుట్ర చేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై గత నాలుగు నెలల క్రితం కలెక్టర్‌ను కలిసి స్థానిక స్థితిగతులు వివరించడం జరిగిందని, సింగరేణి అవసరాల కోసం ఇప్పటి వరకు వంద ఎకరాల భూమి దారాదత్తం చేశామని తెలిపారు. ఇది కాకుండా మిగిలివున్న భూములను తీసుకుని మాకు ఎలాంటి ఆధారం లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. రామారావుపేట్ శివారులో తమకు చెందిన భూములను తెలియకుండా రెవెన్యూ అధికారులతో కలిసి సింగరేణి అధికారులు సర్వేలు చేస్తున్న తీరు బాధాకరమని పేర్కొన్నారు. నాలుగు నెలల క్రితం సర్వే కోసం వచ్చిన అధికారులను అడ్డుకోవడంతో పాటు ఎట్టి పరిస్థితుల్లో భూములు ఇవ్వమని తేల్చి చెప్పినట్లు తెలిపారు. అయినప్పటికీ మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మా భూముల్లో సర్వే చేస్తూ జబర్దస్తీగా భూములను తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ ఆధారంగా జీవిస్తున్న గ్రామస్థుల పట్ల ప్రజా ప్రతినిదులు, ప్రభుత్వ అధికారులు సానుకూలంగా స్పందించాలని, జబర్దస్తీగా భూ సేకరణకు ప్రయత్నిస్తున్న సింగరేణి యాజమాన్యం తీరును కట్టడి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ రైతులకు మూడు గంటల కరెంటు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి రైతులకు బే షరతుగా క్షమాపణ చెప్పాలని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. రైతులకు ఉచిత కరెంట్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ, రైతు వేదికల వద్ద రైతులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా బుధవారం నస్పూర్ మున్సిపల్ పరిధిలోని సీతారాంపల్లి రైతు వేదిక వద్ద రైతులతో ఎమ్మెల్యే దివాకర్ రావు సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదు దశాబ్దాల పాలనలో వ్యవసాయాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసి, రైతులను గోసపెట్టిన కాంగ్రెస్ ఇప్పటికీ అదే పనిచేస్తున్నదని తెలిపారు. ఐదు దశాబ్దాలపాటు కాంగ్రెస్‌పార్టీ కరెంటు, ఎరువులు, నీళ్ల ఇవ్వకుండా, ప్రాజెక్టులు కట్టకుండా, చెరువులు బాగుచేయకుండా వ్యవసాయాన్ని అధోగతి పాలు చేసి, రైతన్నల ఆత్మహత్యలకు కారణమైందని ధ్వజమెత్తారు. ఇప్పుడిప్పుడే కుదటపడుతున్న తెలంగాణ రైతుల కడుపులు కొట్టేవిధంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని విమర్శించారు. నాడు నాట్లు వేసే కాలం వచ్చిందంటే ఎరువుల దుకాణాల ముందు చెప్పుల వరుసలు, విత్తనాల దుకాణాల ముందు క్యూలైన్లు ఉండేవి కావా అని ప్రశ్నించారు. ఎండకాలం వచ్చిందంటే ఎండిన పంటలు, సబ్‌స్టేషన్ల ముందు ధర్నాలు నిత్యకృత్యమయ్యేవని గుర్తుచేశారు. 2014 తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఒకవైపు సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ కాకతీయతో చెరువులను బాగుచేస్తూనే, మరోవైపు రైతుబంధు రైతు భీమా, 24 గంటలనాణ్యమైన ఉచిత విద్యుత్ వంటి విప్లవాత్మక పథకాలు అమలుచేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపెల్లి ప్రభాకర్, నస్పూర్ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మేరుగు పవన్ కుమార్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కౌన్సిలర్ వంగ తిరుపతి, పట్టణ ఉపాధ్యక్షులు దెబ్బటి రామన్న, సంతోష్ చారి పాల్గొన్నారు.

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL PRL. DISTRICT JUDGE AT KOTHAGUDEM
MATOP NO. 120 OF 2022
Between :
Baroth Saltha @ Satta W/o. late shankar & others
......Claim Petitioners
AND
Md. Rasool & others
.......Respondents
ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా! పైన తెలిపిన కేసు నందు రెస్పాండెంట్ నెం.2 అయిన మీరు అనగా ఎస్. ప్రవీణ్‌కుమార్, S/o. Not Known, Age : Adult, Occ : Owner of the Crime Vehicle No. TS 20T 1316, R/o. H.No. 4-64, గోలేటి టౌన్ & పోస్ట్, రెబ్బెన మండలం, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా నివాసి. ఇట్టి కేసునందు తమరికి కోర్టు వారి నుండి ఎన్నిసార్లు నోటీసు పంపినప్పటికి ఎలాంటి స్పందనలు లేవు. కావున ఇట్టి కేసు వాయిదా ది. 27.07.2023న తమరి సమాధానం కొరకు ఉన్నది. వాయిదా రోజున ప్రత్యక్షంగా లేదా పరోక్షంగానైనా హాజరై సమాధానం కోర్టు వారికి సమర్పించవలెను. లేనిచో కోర్టు వారు తమరికి పరోక్షంగా (ఎక్స్‌పార్టీ) తీర్పు చెప్పబడును.
//కోర్టు వారి అనుమతితో//
ఇట్లు
భాగం మాధవరావు
సింగు ఉపేందర్‌రావు
న్యాయవాదులు, కొత్తగూడెం.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
సెల్ : 9948246376

ప్రయాణం నరక ప్రాయం..!

- మందమర్రిలో అధ్వాన్నంగా మారిన రోడ్లు
- అవస్థలకు గురవుతున్న పట్టణ వాసులు





నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి పట్టణంలో రోడ్లు నరక ప్రాయంగా మారాయి. ప్రయాణికులు రోడ్లపై ప్రయాణించేందుకు భయాందోళనకు గురవుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎక్క ప్రమాదం జరుగుతుందోనని భయంతో గమ్యానికి చేరుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు రోడ్లని చిత్తడిగా మారుతున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకి పట్టణంలోని రోడ్లన్నీ కంకర రాళ్ల తేలి బురదమయంగా మారి అధ్వాన్నంగా తయారయ్యాయి. పాత బస్టాండ్‌లోని ప్రొ.జయశంకర్ చౌరస్తా నుంచి రామన్ కాలని వరకు ఏర్పడిన గుంతలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీరు గుంతల్లో చేరడంతో లోతు అంచనా వేయలేక ప్రమాదపుటంచున ప్రయాణిస్తున్నారు. దీనికి తోడుగా పక్కనే నేషనల్ హై వే పనులు ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణ పనులు జరుగుతుండటం తో కళాశాలలు, పాఠశాలలు, కార్యాలయాలకు, కూలీ పనులకు వెళ్లే వారి బాధలు వర్ణనాతీతం. ట్రాఫిక్ జాంలో ఇరుక్కుని ఇబ్బందులు పడుతున్నారు.

ప్రధాన రహదారి పైనే ఇబ్బందులు

పట్టణంలోని అంతర్గత రోడ్లే కాకుండా ప్రధాన రహదారిపైనే ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయల మార్కెట్, దీపక్‌నగర్, శ్రీపతినగర్, అంగడి బజారు, విద్యానగర్, స్టేషన్ రోడ్డు, రామాలయం, 1,2,3వ జోన్లు ఇలా పట్టణంలోని సింగరేణి మున్సిపాలిటీ అనే తేడా లేకుండా వీధులన్నీ అస్తవ్యస్థంగా మారాయి.

అధికారుల సమన్వయ లోపమే ప్రధాన కారణం

పరిస్తితులు ఇంత అధ్వాన్నంగా మారినా అధికారుల తీరులో, నాయకుల వైఖరిలో కొంచెం కూడా మార్పు రావటంలేదని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. సోషల్ మీడియాలో సమస్య వచ్చినప్పుడు తాత్కాలిక మరమ్మత్తులు చేసి ఎవరికి వారే లీడర్లుగా ప్రచారం చేసుకోవడంపై ప్రజలు మంచి పడుతున్నారు. అధికారుల సమన్వయ లోపమే రోడ్ల దుస్థితికి ప్రధాన కారణమని ఆరోపణలు ఉన్నాయి. ఇంటర్నెట్, విద్యుత్, కాలువలు, డ్రైనేజీ, భగీరథ పైప్ లైన్ల పేరుతో ఎవరికి నచ్చినట్టు వారు తవ్వకాలు చేపట్టి తుతూ మంత్రంగా మట్టి వేసి వెళ్లిపోతున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా సమస్య తీవ్రతను గుర్తించి ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పూర్తి స్థాయిలో రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలి



నవతెలంగాణ-హాజీపూర్

ఉపాధ్యాయ, ఉద్యోగుల పాలిట శాపంగా మారిన నూతన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూఎస్‌పీసీ నాయకులు డిమాండ్ చేశారు. మంచిర్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించినప్పటికి ఎలాంటి చలనం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సీపీఎస్ విధానంపై రాష్ట్రాల్లో ఉంచుతారా లేక తీసివేస్తారా అని ఆడిగినప్పటికి ఎలాంటి నిర్ణయాన్ని తెలుపకుండా నాన్చుడు ధోరణిని అవలంబిస్తూ ఉపాధ్యాయ, ఉద్యోగులను నిరాశ, నిస్పృహకు లోనుచేస్తోందన్నారు. 5 సంవత్సరాలు ఎమ్మెల్యేగా చేసిన వ్యక్తులకు జీవితాంతం పెన్షన్ ఇస్తున్న ప్రభుత్వాలు జీవితాంతం ప్రజలకు, ప్రభుత్వాలకు సేవ చేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగులకు మాత్రం పెన్షన్ తీసివేయడం శోచనియమన్నారు. అనంతరం ఐబీ చౌరస్తా లోని అంబెడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాడి రాజన్న, గోళ్ళ రామన్న, అసంపల్లి రమేష్, రాజా వేణు, మోతె జయకృష్ణ, లక్ష్మన్, విజయ్, కిరణ్, కిరణ్ కుమార్, బారిక్ రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దహెగాం : ప్రభుత్వం వెంటనే ఓపీఎస్‌ను అమలుచేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయు మండల అధ్యక్షుడు కంబాల జయేందర్ డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాత పెన్షన్ సాధన రథయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23వ తేదీన కాగజ్‌నగర్‌లోని పటేల్ గార్డెన్‌లో పాత పెన్షన్ సంకల్ప రథయాత్ర పేరుతో ర్యాలీ నిర్వహించి సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ నాయకులు మహేష్, శ్యాంకుమార్‌తో పాటు ఉపాధ్యాయులు విజయనిర్మళ, రవి, రాజేష్, శ్రీనివాస్, సంపత్, తులసీరాం పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సాగు పెంపుకు చర్యలు



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో ఉద్యానవన పంటల సాగు పెంపుకు ఉద్యానవన, వ్యవసాయ శాఖలు, ఉపాధిహామీ చట్టం అధికారులు సమన్వయంతో కృషి చేయాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం స్థానిక సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి కల్పనతో కలిసి ఆ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఉద్యానవన పంటల అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో సాగునీటి వసతి గల 5 ఎకరాల విస్తీర్ణంలోపు గల చిన్న, సన్నకారు రైతులను ఉద్యాన పంటలు సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందని, మిగిలిన వారికి 90 శాతం రాయితీతో మొక్కలు అందించడం జరుగుతుందని తెలిపారు. పథకంపై గ్రామాలలో టాం-టాం చేయించడం, రైతు వేదికలలో సదస్సులు నిర్వహించడం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వివిధ రకాల పండ్ల మొక్కలు మామిడి, సీతాఫలం, స్వీట్ ఆరెంజ్, జామ, సపోట, జీడితో పాటు డ్రాగన్ ఫ్రూట్సు కూడా అందించడం జరుగుతుందని, వీటిని ఉద్యానవన శాఖ పరిధిలో నిర్ణయించిన నర్సరీల ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు. అర్హత గల లబ్దిదారుల ఎంపిక అనంతరం శాఖ పరమైన అనుమతులు పొందిన తరువాత మొక్కలు పిట్టింగ్, ప్లాంటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్టు క్రింద డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, అర్హత గల రైతులను గుర్తించి ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లాకు కేటాయించిన 1 వేయి 467 ఎకరాల లక్ష్యాన్ని సాధించే విధంగా వ్యవసాయ, ఉద్యానవన, ఉపాధిహామీ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, ఆగస్టు మాసాంతం వరకు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో 5 ఎకరాల విస్తీర్ణం కన్నా అధికంగా భూమి గల రైతులను ఆయిల్‌ఫామ్ పంట సాగు చేసేలా ప్రోత్సహించాలని, ఆయిల్‌ఫామ్ పంట సాగుతో కలిగే లాభాలను రైతులకు వివరించి పంట సాగు విస్తీర్ణం పెరిగేలా చూడాలని తెలిపారు. జిల్లాలో 2023-24 సంవత్సరానికి గాను ఆయిల్‌ఫామ్ పంట సాగుపై నిర్ణయించిన 3 వేల 400 ఎకరాల లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణకు కృషి

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో నేర నియంత్రణకు సిబ్బంది కృషి చేయాలని ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్ సూచించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల సిబ్బందితో అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలను నియంత్రించేందుకు, పరిశోధనలోనూ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తూ నేరస్థులకు శిక్ష పడేలా చూడాలన్నారు. వృత్తి నైపుణ్యత, శాస్త్రీయ పరిశోధనలో నిష్ణాతులు కావాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదారుల పట్ల గౌరవంగా వ్యవహరించి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే దిశగా కృషిచేసి, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. ప్రొయాక్టీవ్(క్రియాశీలకం), ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాలతో విధులు నిర్వర్తించాలని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా నివారణకు కృషి చేయాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిషేధిత గంజాయి, మత్తు పదార్థాలు, గుట్కా, పేకాట, గుడుంబా, మట్కా వంటి చట్ట వ్యతిరేకమైన కార్యాకాపాలపై నిఘా ఉంచి అక్రమ రవాణా, సరఫరా చేయడం వంటి విషయాలపై పటిష్టమైన నిఘా ఉంచాలన్నారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ఉత్తమంగా విధులు నిర్వహించిన 11 మంది సిబ్బందికి రివార్డులు అందజేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్, డైలీవేజ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా నాయకుడు కృష్ణమాచారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వ హాస్టల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ రోజువారి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కృష్ణమాచారి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో పాఠశాలల అవుట్సోర్సింగ్ రోజువారి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టేకం ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల రోజువారి సిబ్బంది సమస్యలు పరిష్కరించాలన్నారు. సమస్యలపై చర్చించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈ నెల 25వ తేదీన జిల్లా కేంద్రంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ రోజువారి కార్మికులు హాజరు కావాలన్నారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. గిరిజన విద్యాభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషిస్తున్న కార్మికుల సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదన్నారు. 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నప్పటికీ రోజువారి కూలీగా లెక్క కట్టడం దారుణం అన్నారు. కార్మికులు ఐక్య పోరాటం చేస్తే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని, దీనికి నిర్వహించే జిల్లా కమిటీ సమావేశం విజయవంతం చేయాలన్నారు. జిల్లా కమిటీ సమావేశం ద్వారా భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఔట్ సోర్సింగ్, డైలీవైజ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అరిగెల కోటయ్య, కార్మికులు తుమ్మం నాగోరావ్, గేడం ప్రణయ్ నైతం తారబాయి, మామిడి లక్ష్మీ, అడ రేణుక, నైతం మధుకర్, ఆత్రం మాన్కు బాయి, కుర్సెంగ హిరమన్ పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకొని చూపు మెరుగు పర్చుకోవాలి

నవతెలంగాణ-సారంగాపూర్

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని కంటి చూపు మెరుగు పరుచుకోవాలి కాంగ్రెస్ నాయకుడు శ్రీహరిరావు, రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శ్రీహరిరావు సోదరుడు కూచాడి భాస్కరరావు జ్ఞాపకార్థం జడ్పిటిసి పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డితో కలిసి కంటి పరీక్ష కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. మండల ప్రజలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర వాసులకు కంటి పరీక్ష, ఉచిత వైద్యం అందించే ఉద్దేశంతో కూచాడి భాస్కర్‌రావు స్మారకార్థం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హర్షిత, మాజీ ఎఎంసి చైర్మెన్ దశరథ రాజేశ్వర్, ఎబ్బడి రాజేశ్వర్, దామోదర్‌రెడ్డి, భోల్లోజి నర్సయ్య హాది, వీరయ్య రవికుమార్, సలీం పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

- నవతెలంగాణ ఎఫెక్ట్

నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని ఆడేగామ(కె) గ్రామ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గుంతలు పడిన రోడ్డు గురించి నవతెలంగాణలో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఆర్అండ్‌బి అధికారులు, సర్పంచ్ రోడ్డుపై గుంతలను పూడ్చడానికి కంకర వేశారు. దీంతో గ్రామస్తులు, వాహనాదారులు సంతోషం వ్యక్తం చేశారు.

పారిశుధ్య పనుల పరిశీలన

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ధని, జామ్ గ్రామాలలో పారిశుధ్యం, మన ఊరు మన బడి పనులను బుధవారం ఎంపిడిఓ సరోజ పరిశీలించారు. ధని గ్రామంలో మన ఊరు మన బడి పనులను త్వరగా పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. జామ్ గ్రామంలో పారిశుధ్య పనులను, ఇంకుడు గుంతలను పరిశీలించి వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి అక్కడ ఉన్న స్టాక్ రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. వీరి వెంట ఏపీఓ లక్ష్మారెడ్డి, కార్యదర్శులు అశోక్, ఫిషాన్, ఎఫ్ఏలు శ్రీనివాస్, నాగయ్య ఉన్నారు.

ఎస్సైగా శ్రీకాంత్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

నూతన ఎస్సైగా శ్రీకాంత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్ నుండి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై రాహుల్ గైక్వాడ్ తానూర్ మండలానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌కు పోలీస్ సిబ్బంది నారాయణరెడ్డి, వాహేద్, గంగాధర్, సునీల్, అశోక్, వనిత శుభాకాంక్షలు తెలిపారు.

జీపీ కార్మికులను ప్రభుత్వం మోసం చేస్తోంది

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



ఆసిఫాబాద్‌లో..

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామపంచాయతీలు దేశంలో అత్యున్నత అవార్డులు పొందడానికి కారణమైన పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా వారిని ప్రభుత్వం మోసం చేస్తోందని వివిధ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. పంచాయతీ కార్మికులు గత 13 రోజుల నుండి కలెక్టరేట్ ఎదురుగా చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం వివిధ పార్టీల ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతున్న కార్మికుల సమ్మె విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. 14 రోజులుగా ఎక్కడి చెత్త అక్కడే ఉంటూ ప్రజలు దుర్గంలో బతకాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. పంచాయతీల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించడంపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ కనపరుస్తుందన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి లేనియెడల కార్మికులతో పాటు తాము కూడా పోరాటంలో పాల్గొంటామని హెచ్చరించారు. అతి తక్కువ వేతనంతోనే పనిచేసే గ్రామపంచాయతీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, పీసీసీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సరస్వతి, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కేశవరావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, బీఎస్పీ పార్టీ నాయకులు భూక్యా రాజు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, సీపీఐ-ఎంఎల్ రెడ్ స్టార్ నాయకుడు తిరుపతి, బీసీ సంక్షేమ సంఘం రైతు అధ్యక్షుడు వైరగడే మారుతి, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలశ్రీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు శంకర్, సమ్మయ్య, రాజు, నగేష్, మహేష్ పాల్గొన్నారు.

జన్నారం : జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మండల పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్షుడు, గట్టు రాజమల్లు, ప్రధాన కార్యదర్శి అయ్యోరు రాజు అన్నారు. 13 రోజులుగా నిరాహారిక సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు డప్పులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే తమ సమస్యలు పరిష్కరించకుంటే పారిశుధ్య కార్మికుల సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల వైస్ ప్రెసిడెంట్ దూమల్ల సుధాకర్, కోశాధికారి చారి, సభ్యులు దోమల రవి, లచ్చన్న, బాపన్న, బైరి లచ్చన్న, శ్రీను, దుబ్బయ్య దాసు పాల్గొన్నారు.

హాజీపూర్ : రాష్ట్ర వ్యాప్తంగా గత 14 రోజులుగా కొనసాగుతన్న జీపీ కార్మికులకు సమ్మెకు బీఎస్పీ బుధవారం మద్దతు తెలిపింది. ఆ పార్టీ మంచిర్యాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బద్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బద్రి శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సమాజంలోని అన్ని పేద వర్గాలకు సామాజిక న్యాయం దక్కాలంటే బీఎస్పీతోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల పోరాట సమితి జాతీయ నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామ పంచాయితీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.జీపీ కార్మికుల బిక్షాటన

భీమారం : తమను రెగ్యులర్ కార్మికులుగా గుర్తించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేపట్టిన జీపీ కార్మికులు బుధవారం బిక్షాటనతో నిరసన తెలిపారు. గత 13 రోజులుగా సమ్మె చేపట్టిన జీపీ కార్మికులు సీఐటీయూ మండల అధ్యక్షుడు అనపురం కృష్ణమూర్తి గౌడ్ ఆధ్వర్యంలో వ్యాపార సముదాయాలలో బిక్షాటన నిర్వహించారు. నిత్యం గ్రామ పారిశుధ్య నిర్వాహణలో మమేకమై ప్రజల ఆరోగ్యంతోపాటు సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తున్న తమకు కనీస వేతనం చెల్లించకపోతే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తమ నాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దహెగాం : మండలకేంద్రంలో పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె 14వ రోజు భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు చంద రమేష్ మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఉద్యమాలతోనే సాధించుకున్న తెలంగాణలో కార్మికులు చేస్తున్న ఉద్యమాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం సోచనీయమని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు తామెర రాజ్‌కుమార్, ప్రభాకర్‌గౌడ్, సాయి పాల్గొన్నారు.



దహెగాంలో..